29-03-2025
శనివారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 189 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి


జయభేరి



# మయన్మార్, థాయిలాండ్ లకు అండగా ఉంటాం

✍ **జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 28:**

మయన్మార్, థాయిలాండ్‌లలో భూకంపం వల్ల సంభవించిన భయంకరమైన విధ్వంసంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మయన్మార్, థాయిలాండ్‌లలో భూకంపం తర్వాత పరిస్థితి గురించి తాను ఆందోళన చెందుతున్నానని ఆయన అన్నారు. అందరి భద్రత, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నానన్నారు. భారతదేశం అన్ని విధాలుగా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ విషయంలో, భారత్ అధికారులు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. మయన్మార్, థాయిలాండ్ ప్రభుత్వాలతో




# ఇమ్మిగ్రేషన్ బిల్లుకు ఆమోదం



✍ **జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 28:**

ర్యాటకులుగా, విద్య, ఆరోగ్యం, సంరక్షణ, వ్యాపారం కోసం భారత్‌కు రావాలనుకునే వారిని తమ ప్రభుత్వం ఆహ్వానించడానికి సిద్ధంగా ఉందని హోం మంత్రి అమిత్ షా అన్నారు. అయితే, భారత దేశానికి హాని కలిగించే ప్రమాదకరమైన వారి పట్ల మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఇమ్మిగ్రేషన్, ఫారనర్స్ బిల్లు 2025పై గురువారం లోక్‌సభలో జరిగిన చర్చలో అమిత్ షా పాల్గొని, మాట్లాడారు. ఇండియాలోకి దురుద్దేశంతో వచ్చే వారిని మోడీ ప్రభుత్వం ఆహ్వానించబోదని తేల్చి చెప్పారు. అందరినీ తెచ్చి పెట్టుకోవడానికి ఇండియా ఏమీ ధర్మసత్రం కాదని తెలిపారు. జాతీయ భద్రతకు ముప్పు కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆహ్వానించబోమని, దేశాభివృద్ధికి తోడ్పడటానికి ఎవరైనా వస్తే వారిని ఎప్పుడూ స్వాగతిస్తామని స్పష్టం చేశారు. ఇమ్మిగ్రేషన్, ఫారనర్స్ బిల్లు 2025 దేశ భద్రతను

...మిగతాది 2 లో



# అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

**రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్ధాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు.**

✍ **జయభేరి, హైదరాబాద్, మార్చి 28 :**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇకనైనా నిజాలు మాట్లాడాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సూచించారు. కాంగ్రెస్ తాము ఇన్నాళ్లు చెప్పినవి అబద్ధాలు అని ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని అన్నారు. శాసనమండలిలో ఇవాళ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు. అప్పులపై కాంగ్రెస్ నేతల తప్పులు బయటపడ్డాయని అన్నారు. రాష్ట్రం అప్పులు మొత్తం రూ.4.42 లక్షలుగా పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం రూ.8 లక్షల కోట్లు అప్పులున్నాయని దష్ప్రచారం చేస్తున్నారని కవిత విమర్శించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా నిజాలు చెప్పాలని అన్నారు. అబద్ధాలు చెబుతున్నామని కాంగ్రెస్ పార్టీ ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుందని సూచించారు. కాళేశ్వరం బ్యారేజీలు కూలిపోతాయన్నదానిలో వాస్తవం లేదని, స్వయంగా ఇరిగేషన్ మంత్రి మండలిలో ఈ విషయం చెప్పారని అన్నారు. 'నీళ్లు ఇవ్వగలిగి ఇవ్వకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం కాదా..?' అని కవిత ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని చెప్పారు. ఏప్రిల్ 27న ఎల్కతుర్తి వద్ద బీఆర్ఎస్ పార్టీ

...మిగతాది 2 లో




# కేజ్రీవాల్ పై మరో కేసు



✍ **జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 28:**

ఇప్పటికే లిక్కర్ స్కామ్ కేసులో జైలుకు వెళ్లి వచ్చి, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన అరవింద్ కేజ్రీవాల్‌కు మరో షాక్ తగిలింది. పబ్లిక్ ప్రాపర్టీ యాక్ట్‌ను ఉల్లంఘించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు మరికొంతమందిపై ఢిల్లీ పోలీసులుఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రౌస్ అవెన్యూ కోర్టులో కంప్లైయన్స్ నివేదికను దాఖలు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ కేసుపై ఏప్రిల్ 18న రౌస్ అవెన్యూ

...మిగతాది 2 లో

# అకాల వర్షాలు జాగ్రత్త

✍ **జయభేరి, హైదరాబాద్, మార్చి 28:**



తెలంగాణ రాష్ట్రంలో దాదాపు వారం రోజుల పాటు అక్కడక్కడా అకాల వర్షాలు కురిశాయి. అయితే వారం రోజుల అనంతరం నేటి నుంచి రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మళ్లీ నమోదు అవుతున్నాయి. రాబోయే రెండు రోజుల్లో తెలంగాణలో 15 జిల్లాలకు 41 నుంచి 44 డిగ్రీల వవరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని.. ఆయా జిల్లాలో వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పొడి వాతావరణం కొనసాగుతుందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. రాబోయే కొద్ది రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 2 డిగ్రీల నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని వివరించింది. ఆదిలాబాద్, కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, ఖమ్మం, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాలు, ములుగు, నాగర్‌కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వనపర్తి జిల్లాల్లో 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. ఈ జిల్లాల ప్రజల అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

...మిగతాది 2 లో



**కశ్మీర్ కను మరుగేనా**

2 లో

# హైబ్రిడ్ మోడల్ రోడ్ల విధానం



✍ **జయభేరి, హైదరాబాద్, మార్చి 28:**

రాష్ట్రంలో రోడ్లను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ఒక కొత్త ప్రణాళికను సిద్ధం చేసింది. అదే హైబ్రిడ్ మోడల్ రోడ్ల విధానం. ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులను కలిపే ఈ మోడల్.. వనరుల వినియోగాన్ని ఆప్టిమైజ్ చేస్తూ ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచుతుంది. HAM ఫ్రేమ్‌వర్క్ కింద.. రాష్ట్ర ప్రభుత్వం మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం భరిస్తుంది. మిగిలిన 60 శాతం ప్రైవేట్ డెవలపర్లు నిధులు సమకూరుస్తారు.

...మిగతాది 2 లో



# అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా పిఠాపురం

✍ **జయభేరి, కాకినాడ, మార్చి 28:**

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం నియోజకవర్గంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదనిపిస్తుంది. అన్నీ తెలిసి మౌనంగా ఉంటున్నారా? లేక వాటంతట అవే సర్దుకుంటాయని భావిస్తున్నారో తెలియదు కానీ పవన్ కల్యాణ్ మౌనం మాత్రం పిఠాపురం టీడీపీ నేతలకు ఎక్కడో కాలుతున్నట్లే కనపడుతుంది. వరసగా జరుగుతున్న ఘటనలు చూస్తుంటే పవన్ కల్యాణ్ కు అన్నీ తెలిసి జరుగుతున్నాయని అనుకోవాలని తెలుగు తమ్ముళ్లు భావిస్తుంటే, పవన్ వస్తే అంతా సెట్ రైట్ అవతుందని జనసైనికులు చెబుతున్నారు. అసలు పిఠాపురం నియోజకవర్గాన్ని ఎందుకు జనసేన నేతలు ఇంత కాంట్రవర్సీతో కొని తెచ్చుకుంటున్నారన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పిఠాపురంలో జనసేన ఆవిర్భావ సభకు ముందు నుంచే టీడీపీ, జనసేనల మధ్య వార్ ప్రారంభమయినట్లు

...మిగతాది 2 లో

**పడకేసిన రియల్ ఎస్టేట్**

2 లో

మొదటిపేజీ తరువాయి

## అండగా ఉంటాం

సంప్రదింపులు కొనసాగించడం గురించి విదేశాంగ మంత్రిత్వ శాఖతో చర్చ జరిగింది.మయన్మార్‌లో సంభవించిన భూకంపం కారణంగా థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో సంభవించిన విధ్వంసం హృదయ విదారకంగా ఉంది. మార్చి 28న, మయన్మార్‌ను 7.7, 6.4 తీవ్రతతో భూకంపాలు తాకాయి. దీని కేంద్రం రాజధాని నగరానికి వాయువ్యంగా కేవలం 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న సాగింగ్ సమీపంలో ఉంది. మయన్మార్ భూకంపంలో వందలాది భవనాలు కుప్పకూలాయి. శిథాలాల కింద చిక్కుకున్న వేలాది మందిని బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మృతుల సంఖ్య భారీగా ఉండే అవకాశం ఉంది.ఏళ్ల చరిత్ర ఉన్న అవా బ్రిడ్జి సైతం నేలమట్టమైంది. థాయ్‌లాండ్‌లో వందల బౌద్ధరామాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అన్నీ విమాన సర్వీసులను రద్దు చేసి.. ఎయిర్‌పోర్ట్‌ను లాక్‌డౌన్ చేశారు. భూకంపం ఎఫెక్ట్‌తో ఇటు బ్యాంకాక్‌లో ట్రైన్లు సైతం ఊగాయి. దీంతో బ్యాంకాక్‌లో మెట్రో, రైలు సేవలు పూర్తిగా నిలిపివేశారు. మయన్మార్ భూకంపం ఎఫెక్ట్‌తో భారత్‌లోనూ పలు ప్రాంతాల్లో భూప్రకంపనలు సంభవించాయి. మేఘాలయా, కోల్‌కతా, ఇంఫాల్, ఢిల్లీలో భూమి కంపించింది. ఇంఫాల్‌లో భయాందోళనతో జనం పరుగులు తీశారు. మేఘాలయాలో భూకంప తీవ్రత 4.0గా నమోదైంది.

## అబద్ధాలు చెప్పి అధికారంలోకి..

రజతోత్సవ సభ జరుగుతుందని ఆమె తెలిపారు. మహాకుంభమేళా తరహాలో సభను నిర్వహిస్తామని అన్నారు. ఇరవై ఐదు వసంతాల బీఆర్ఎస్ పార్టీ ఉత్సవాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కవిత పిలుపునిచ్చారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ప్రజల గొంతుకగా వ్యవహరించిందని అన్నారు.సమన్వయంతో అన్ని అవకాశాలను వాడుకొని ప్రభుత్వాన్ని ప్రశ్నించామని, అన్ని చర్చల్లో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామని కవిత చెప్పారు. ప్రజలు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల సమస్యలపై గళమెత్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రతి రోజూ వినూత్న రీతిలో నిరసనలు తెలిపామని గుర్తుచేశారు. కేసీఆర్‌పై ముఖ్యమంత్రి చేసిన అనుచిత వ్యాఖ్యలపై కూడా సభలో నిరసన తెలిపామని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పై తాము చేసిన పోరాటానికి ప్రభుత్వం దిగొచ్చిందని, ఎప్పటికప్పుడు ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేస్తామని మండలి సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని చెప్పారు. ప్రకటించిన విధంగా సీఎం ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను విడుదల చేసేవరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామని కవిత అన్నారు. ఈ మండలి సమావేశాలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయని, ఈ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందాయని తెలిపారు. ఆ బిల్లుల ఆమోదానికి బీఆర్ఎస్ పార్టీ కృషి ఫలితం ఎంతో ఉందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలను ఉద్దేశించి పరుష పదజాలంతో ముఖ్యమంత్రి అసభ్యంగా మాట్లాడారని, ఆ వ్యాఖ్యలు ఆయన చరిత్రలో మరకగా ఉండిపోతాయని అన్నారు.

## అకాల వర్షాలు జాగ్రత్త

మిగిలిన జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల సెల్సియస్ నుండి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.పలు జిల్లాలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో 41 డిగ్రీల సెల్సియస్, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 40.9 డిగ్రీల సెల్సియస్, నిజామాబాద్, వనపర్తి జిల్లాల్లో 40.9 డిగ్రీల సెల్సియస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 40.7 డిగ్రీల సెల్సియస్, కామారెడ్డి జిల్లాలో 40.6 డిగ్రీల సెల్సియస్, నిర్మల్ జిల్లాలో 40.5 డిగ్రీల సెల్సియస్, మంచిర్యాల జిల్లాలో 40.4 డిగ్రీల సెల్సియస్, నల్గొండ జిల్లాలో అత్యధికంగా 40.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ శాఖ వివరించింది. హైదరాబాద్ మహానగరం, అలాగే పక్కన జిల్లాలతో సహా ఇతర ప్రాంతాలలో 38 డిగ్రీల సెల్సియస్ నుంచి 39 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదైనట్టు వాతావరణ శాఖ పేర్కొంది. ఇప్పుడే ఇలా ఎండలు దంచికొడుతుంటే ముమ్మందు భారీగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే ఛాన్స్ ఉంది. ఇంకా మే మాసంలో కొన్ని ప్రాంతాల్లో 45 డిగ్రీల వరకు చేరే అవకాశం ఉందని, తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 42 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో 23 డిగ్రీల అదనపు పెరుగుదల ఉండొచ్చని అధికారులు ఇప్పటికే వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ భారీ ఎండల నుంచి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రజలు ఎక్కువ నీరు తాగాలని, మధ్యాహ్న సమయంలో బయట రావొద్దని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్..

కనిపిస్తుంది. ఎలాగంటే మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ పిఠాపురం అంటే పవన్ కల్యాణ్ అడ్డా అని అనడం, అక్కడ మరో నేతకు అవకాశం లేదని చెప్పడం వివాదంగా మారింది. నాదెండ్ల మనోహర్ అలాంటి వ్యాఖ్యలు చేశారంటే పవన్ కల్యాణ్ కు తెలియకుండా చేశారని అనుకోలేం. అందులో పవన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఏం మాట్లాడినా జనసేన నేతలు ఆచితూచి మాట్లాడతారు. నాదెండ్ల మనోహర్ పవన్ కల్యాణ్ అడ్డా పిఠాపురం అనడంతో వర్మతో పాటు అనేక మంది టీడీపీ నేతలకు కొంత ఇబ్బందికరంగా మారింది. తర్వాత ఆవిర్భావ సభలోనూ నాగబాబు చేసిన వ్యాఖ్యలు మరింత ఆజ్యాన్ని పోశాయి. పిఠాపురంలో పవన్ కల్యాణ్ గెలుపునకు పవన్ ఒక కారణమయితే, జనసేన క్యాడర్ మరో కారణమని, ఎవరైనా తామే పవన్ విజయానికి కారణమని భావిస్తే వారి ఖర్మ అని చేసిన వ్యాఖ్యలు వర్మతో పాటు టీడీపీ స్థానిక నేతల్లో గునపాలు దిగినట్లయింది. దీంతో పాటు అదే సభలో పవన్ కల్యాణ్ కూడా టీడీపీని అధికారంలోకి తెచ్చామని చెప్పి మరింత వివాదానికి తావిచ్చారు. అప్పటి నుంచి పిఠాపురం నియోజకవర్గంలో ఇటు టీడీపీ, అటు జనసేన నేతలు, క్యాడర్ మధ్య పొసగడం లేదన్నది యదార్థం. కానీ రెండు పార్టీల అగ్రనేతలు పిఠాపురం లో జరుగుతున్నవిషయాలను పట్టించుకోకపోవడంతో రోజురోజుకూ ముదురుతున్నాయి. తాజాగా పిఠాపురం జనసేన ఇన్ ఛార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని టీడీపీ క్యాడర్ అడ్డుకుంది. నియోజకవర్గంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం సందర్భంగా ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. తమ నేత వర్మకు ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందకపోవడం వల్లనే టీడీపీ శ్రేణులు బరస్ట్ అయ్యారంటున్నారు. ఇలా పిఠాపురంలో రెండు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. కానీ పవన్ కల్యాణ్ మాత్రం విభేదాలను మాపే ప్రయత్నం చేయకపోవడం కూడా టీడీపీ నేతలకు మరింత ఆగ్రహాన్ని తెప్పిస్తుంది. ఇంత జరుగుతున్నా తమ పార్టీ నేతలకు, క్యాడర్ కు సర్దిచెప్పాల్సిన పవన్ మౌనం పాటించడం వెనక వర్మను సైడ్ చేయాలన్న లక్ష్యమే కనిపిస్తుందన్న అభిప్రాయం పిఠాపురం టీడీపీ నేతల్లో మరింత బలపడుతుంది. మరి ఈ వివాదం ఎటు దారి తీస్తుందన్నది చూడాలి.

పిఠాపురం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని, మౌలిక వసతుల కల్పన విషయంలో చురుగ్గా వ్యవహరించాలని అధికారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పిఠాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (పాడా) డైరెక్టర్ పర్యటించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. తమ పర్యటన వివరాలను ఉప ముఖ్యమంత్రికి తెలియచేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నిధులతో చేపడుతున్న రహదారి పనులు, ఉపాధి హామీ కార్యక్రమాల అమలుపై పురోగతి నివేదికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని గ్రామాలు, పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో తాగు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ వేసవి సమయంలో నీటి సరఫరాకు ఎలాంటి అంతరాయాలు ఉండకూడదని, సమ్మర్ స్టోరేజి ట్యాంక్స్ దగ్గర తనిఖీలు చేయాలన్నారు. నియోజకవర్గం అభివృద్ధికి వివిధ పథకాల ద్వారా నిధులు సమకూరుస్తున్నాము. వాటిని సద్వినియోగం చేసి ప్రజలకు మేలు చేసే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని పవన్ తెలిపారు. అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ప్రతి వారం ఈ పనులపై సమీక్ష చేపడతాను. అధికారులు క్షేత్ర స్థాయి పురోగతిని నిశితంగా పరిశీలించాలి. పనుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. తన కార్యాలయ దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక వ్యవస్థ పని చేస్తోందని.. విద్యుత్ అంతరాయ సమస్య ఉందని తెలియగానే టిడ్కో గృహాల దగ్గర రూ.3 కోట్లతో 5 ఎం.వి.ఎ సామర్థ్యంతో కొత్త సబ్ స్టేషన్ పనులు చేపట్టామన్నారు. అమృత్ 2.0 ద్వారా పిఠాపురం పట్టణంలో తాగు నీటి సమస్యలు పరిష్కరించేందుకు ఇప్పటికే పురపాలక శాఖ అధికారులతో సమీక్ష చేశామని పిఠాపురం – ఉప్పాడ రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపగలిగామన్నారు. రూ.59.7 కోట్లు నిధులు మంజూరయ్యాయి.

# కశ్మీర్ కనుమరుగేనా

భారతదేశానికి తలమానికగా ఉన్న కశ్మీర్ త్వరలోనే కనుమరుగు అవుతుందా..? అక్కడి వాతావరణం చూస్తుంటే అలాగే అనిపిస్తోంది. కశ్మీర్ కింద భూమి అపాయం అంచులో కొట్టుమిట్టాడుతోంది. కాలం గడుస్తున్న కొద్దీ.. కశ్మీర్‌లో పరిస్థితులు ఏవీ కలిసిరావడం లేదు. రాజకీయం, పర్యావరణం.. ఏదీ కశ్మీర్‌ను కాపాడే కండీషన్‌లో లేవు.



**కశ్మీర్ హిమాలయాల్లో శాశ్వతంగా పరుచుకున్న మంచు ప్రస్తుతం సాధారణం కంటే అత్యంత ఎక్కువగా కరగడం మొదలయ్యింది. ఇది ఒక ప్రత్యేకమైన పర్యావరణ ముప్పుగా మారుతుందని ఇటీవలి అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.అందంగా పరుచుకున్న ఈ శాశ్వత మంచు కరిగిపోవడం వల్ల.. పర్వత ప్రాంతంలోని 193 కిలో మీటర్ల మేర ఉన్న రోడ్లు.. 2 వేల 415 గృహాలు.. 903 ఆల్పైన్ సరస్సులు.. 8 జలవిద్యుత్ ప్రాజెక్టులకు ముప్పు పొంచి ఉందని ఒక కొత్త అధ్యయనంలో పరిశోధకులు కనుక్కున్నారు.**

ఒకవైపు అభివృద్ధి పేరుతో పర్యావరణం పాడైపోతుంటే.. మరోవైపు, భూమిపై పెరుగుతున్న వాతావరణ మార్పు కశ్మీర్ ఊపిరిని స్లోగా మింగేస్తుంది. వెరసి, చల్లని ప్రదేశం కాస్తా సెగలు కక్కుతోంది. కశ్మీర్‌ని చూడని వాళ్లు ఎవరైనా ఉంటే.. త్వరగా వెళ్లి చూసేయండి. ఎందుకంటే, ఇంకొన్ని సంవత్సరాల్లో కశ్మీర్ ఇప్పుడు అనుకుంటున్నంత అద్భుతంగా ఉండకపోవచ్చు. అందమైన మంచు అంతా కరిగిపోయి.. మనం రెగ్యులర్‌గా చూసే కొండలా రాళ్లు రప్పలు మట్టితోనే కనిపించొచ్చు. ఇంకా లేదంటే.. అసలు కొండలన్నీ కూలిపోయి, అల్లకల్లోలంగా మారొచ్చు. పచ్చని భూమి, రహదారులు, వంతెనలన్నీ కుంగిపోయి భారీ గోతులే మిగలొచ్చు. విపరీతమైన భూకంపాలు, దారుణమైన ఉప్పెనలతో కశ్మీర్ కళ తప్పి పోవచ్చు అవును.. వినడానికి చాలా కష్టంగా ఉన్నా.. జమ్మూ కశ్మీర్ భూమి కింద పెద్ద అపాయం దాగుంది. స్లో పాయిజన్‌లా అది ఆ ప్రాంతంలో భూమి బలాన్ని నీరుగారుస్తుంది. ఫలితంగా.. ఇంకొన్ని సంవత్సరాల్లో జమ్మూ కశ్మీర్, లడఖ్‌లో భూమి ద్రవంగా మారి, కుంగిపోయే ప్రమాదం ఉంది. కశ్మీర్ హిమాలయాల్లో శాశ్వతంగా పరుచుకున్న మంచు ప్రస్తుతం సాధారణం కంటే అత్యంత ఎక్కువగా కరగడం మొదలయ్యింది. ఇది ఒక ప్రత్యేకమైన పర్యావరణ ముప్పుగా మారుతుందని ఇటీవలి అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.అందంగా పరుచుకున్న ఈ శాశ్వత మంచు కరిగిపోవడం వల్ల.. పర్వత ప్రాంతంలోని 193 కిలో మీటర్ల మేర ఉన్న రోడ్లు.. 2 వేల 415 గృహాలు.. 903 ఆల్పైన్ సరస్సులు.. 8 జలవిద్యుత్ ప్రాజెక్టులకు ముప్పు పొంచి ఉందని ఒక కొత్త అధ్యయనంలో పరిశోధకులు కనుక్కున్నారు. జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలోని భూమి కింద కనీసం రెండు సంవత్సరాలుగా నిరంతరం ఘనీభవించిన నేల, అవక్షేపాలు, రాతి మొదలైన వాటితో ఏర్పడిన పెర్మాఫ్రాస్ట్ ఉంది. మంచు గడ్డలా ఘనీభవించిన ఈ భూమిపైన శాశ్వతంగా మంచు కప్పబడి ఉంటుంది. ఈ మంచులో ఎక్కువ భాగం అనేక సహస్రాబ్దాలుగా అలాగే ఉంది. అయితే, ఈ అధ్యయనంలో భాగంగా.. 2002 నుండి 2023 వరకు ఉపరితల ఉష్ణోగ్రతల ఎలా ఉన్నాయో తెలుసుకోడానికి ఉపగ్రహ డేటాను విశ్లేషించగా ఈ విషయం వెల్లడయ్యింది. 21 సంవత్సరాల కాలంలో ప్రతి సంవత్సరానికి 56కి పైగా చిత్రాలను పరిశీలించారు పరిశోధకులు. మొత్తం 11 వందల 76 భూ ఉపరితల ఉష్ణోగ్రత చిత్రాల డేటాసెట్ ద్వారా ఒక అంచనాకు వచ్చారు. ఈ డేటా మోడిస్ అని పిలిచే టెర్రా, ఆక్వా ఉపగ్రహాలపై ఉన్న నాసా సెన్సార్ నుండి సేకరించింది. అయితే, ఈ చిత్రాల్లో ప్రతి పిక్సెల్ 1 చదరపు కిలో మీటర్ల వైశాల్యాన్ని చూపిస్తుంది. ఈ ప్రకారం.. జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లోని సుమారు 222,236 పిక్సెల్‌లను విశ్లేషించారు.సాధారణంగా చెట్లు ఎక్కువగా ఉండటం వల్ల సూర్య కిరణాలు శాశ్వత మంచుపై పడి, దాన్ని కరిగించకుండా రక్షిస్తాయి. అలాగే, భూకంపాల వంటి సహజ ప్రక్రియలను నియంత్రిస్తాయి. అయితే, అభివృద్ధి పేరుతో భారీగా ఆనకట్టల నిర్మాణం, రోడ్లు వేయడం, కొండలను తొలుస్తూ టన్నెల్స్ నిర్మించడం, ఈ ప్రాంతంలో భారీగా పెరిగిన పర్యాటకం.. ముఖ్యంగా, 370 రద్దు తర్వాత పెరిగిన రియల్ ఎస్టేట్.. వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా పశ్చిమ హిమాలయాలు ప్రమాదంలో పడినట్లు తెలుస్తోంది. కశ్మీర్ నేలపై ఒత్తిడి పెరుగుతున్న కొద్దీ ఆ ప్రాంతంలోని శాశ్వత మంచు స్థిరత్వం ప్రశ్నార్థకంగా మారిందని అధ్యయనాలు చెబుతున్నాయి.ఇక, సిక్కింలోని దక్షిణ లోనాక్ సరస్సు, అక్టోబర్ 2023లో ఇలాంటి పరిస్థితులలోనే భారీ నాన్‌ట్రివియల్ గ్లేషియల్ లేక్ అవుట్‌బర్స్ట్ ఫ్లడ్‌ని ఎదుర్కొంది. సరస్సు చుట్టూ శాశ్వత మంచుతో నిండిన పదార్థంతో కూడిన మొరైన్‌లు ఉన్నాయి. కాలక్రమేణా, ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు క్షీణించిన ఈ శాశ్వత మంచు వల్ల కొండవాలు పూర్తిగా కూలిపోయింది. ఇలా శాశ్వత మంచు క్షీణత వల్ల భూగర్భ జలాలు, నదినీటి లభ్యత కూడా ప్రతికూల ప్రభావాలకు లోనయ్యే అవకాశం ఉంది. ఇక, రాతి హిమానీనదాల రూపంలో శాశ్వత మంచు, నది ప్రవాహానికి దోహదం చేస్తుంది. కొన్ని ప్రాంతాల్లో అయితే, దాని క్షీణత నదుల మూల ప్రవాహాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. అయితే, భారతదేశంలో ఈ ప్రభావాలను ఖచ్చితంగా గుర్తించడానికి సమగ్ర అధ్యయనాలు ఇప్పటి వరకూ జరగలేదు. కాబట్టి, ఈ విషయంపై ఖచ్చితమైన ప్రకటనలు ఇప్పట్పుడే చేయలేమన్నది పరిశోధకుల అభిప్రాయం. అయితే, ఒక్కటి మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. శాశ్వత మంచుకు వస్తున్న ఈ నష్టం వల్ల కశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలకు కూడా ప్రమాదం పొంచి ఉందని తెలుస్తోంది.ఈ శాశ్వత మంచును పరిరక్షించడం కోసం ఇప్పటికే ప్లాన్ చేసిన రోడ్లను ఆపకపోయినప్పటికీ.. భవిష్యత్‌లో ప్లాన్ చేసే నిర్మాణాలను శాశ్వత మంచు ఉన్న ప్రదేశాల్లో నిర్మించకపోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, పర్యావరణ పరంగా పెళుసుగా ఉండే ప్రాంతాల్లో స్థిరమైన నిర్మాణాలు చేపట్టకపోవడం మంచిదని అంటున్నారు. ఇక, జలవిద్యుత్ విద్యుత్ ప్రాజెక్టుల వంటి భారీ ప్రాజెక్టులకు పర్యావరణ ప్రభావాలు ఎలా ఉంటాయనే అంచనాలు వేస్తున్నప్పటికీ.. అవి నాన్‌ట్రివియల్ గ్లేషియల్ లేక్ అవుట్‌బర్స్ట్ ఫ్లడ్‌కి, ఇతర క్రయోస్పిరిక్ ప్రమాదాలను తెస్తాయా లేదా అనేది కూడా పరిశీలించాలనే సూచనలు ఉన్నాయి. ఎందుకంటే, గతంలో జరిగిన పెద్ద విపత్తుల తర్వాతే ఈ శాశ్వత మంచు సంబంధిత ప్రమాదాల గురించి అవగాహన పెరిగింది. గతంలో, నాన్‌ట్రివియల్ గ్లేషియల్ లేక్ అవుట్‌బర్స్ట్ ఫ్లడ్‌లు ప్రధానంగా నేపాల్‌లో సంభవించేవి. అయితే, కేదార్‌నాథ్ విపత్తు, దక్షిణ లోనాక్ సరస్సు విస్ఫోటనం, లడఖ్‌లో జరిగిన సంఘటనలు ఇప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నాయి.రాబోయే ప్రమాదాన్ని తగ్గించడానికి.. పరిశోధకులు చెబుతున్న సూచనలు పాటించడం చాలా కీలకమని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా శాశ్వత మంచు ఉన్న ప్రదేశాల్లో దీన్ని తక్షణమే అమలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఎందుకంటే, శాశ్వత మంచు అధికంగా ఉన్న ప్రాంతాలలోని ఇళ్లు.. పలు స్థాయిల్లో ప్రమాదం ఎదుర్కొనే అవకాశం ఉంది. లడఖ్‌లో, శాశ్వత మంచు ఉన్న నిటారైన కొండవాలుల్లో ఇళ్లు ఎక్కువగా ఉన్నాయి. వీటికి ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండొచ్చు. అలాగే, లడఖ్‌లోని మిలటరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా ప్రమాదంలో ఉన్నాయి. కాబట్టి, కశ్మీర్, లడఖ్‌లో ఇలాంటి పరిస్థితి ఏర్పడటం జాతీయ భద్రతకు కూడా ఆందోళనలను కలిగిస్తోంది. ఈ ప్రాంతంలో.. అనేక వ్యూహాత్మక రోడ్లు.. శాశ్వత మంచు మండలాల గుండా వెళతాయి. అలాంటి చోట.. శాశ్వత మంచు కరిగిపోతే.. రోడ్లు కుంగిపోయి కనెక్టివిటీకి కూడా తీవ్రమైన అంతరాయాలు ఏర్పడతాయనడంలో సందేహం లేదు.ఈ డేటా లాగర్లు ఉపగ్రహ డేటాను క్రమపద్ధతిలో విశ్లేషించడంలో.. ఏవైనా మార్పులు ఉంటే వాటిని గుర్తించడంలో కూడా సహాయపడతాయి. శాశ్వత మంచును పర్యవేక్షించడంలో ఇవి మరింత ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తాయి. కాబట్టి, కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్న జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో ప్రభుత్వం దీని దిశగా చర్యలు చేపట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే, పర్యావరణాన్ని కాపాడుకోడానికి అవసరమైన ప్రణాళికల రూపకల్పన చేయాలని కూడా చెబుతున్నారు.

## ఇమ్మిగ్రేషన్ బిల్లుకు ఆమోదం

బలోపేతం చేయడమే కాకుండా ఆర్థిక వ్యవస్థను, వ్యాపార అవకాశాలను పెంపొందిస్తుందని ఆయన తెలిపారు. ఆరోగ్యం, విద్యా రంగాలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఇమ్మిగ్రేషన్ బిల్లు చట్టంగా మారిన తర్వాత ఇండియాను సందర్శించే ప్రతీ విదేశీయుడి గురించిన తాజా సమాచారం అందుబాటులో ఉంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు.బంగ్లాదేశీయులు, మయన్మార్ నుంచి రోహ్యింగాలు.. భారత దేశంలోకి అక్రమంగా చొరబడుతున్నారని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత లాభం కోసం దేశంలో ఆశ్రయం పొందుతున్న వారి సంఖ్య పెరుగుతోందని అన్నారు. దీని వల్ల దేశం సురక్షితంగా లేకుండా పోతుందని, చొరబాటుదారులు దేశంలో అశాంతిని సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ బిల్లు దేశ భద్రతను బలోపేతం చేయడమే కాకుండా 2047 నాటికి ప్రపంచంలోనే అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు సహాయపడుతుందన్నారు.పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ చొరబాట్లపై కఠినమైన చర్యలు తీసుకోవడం లేదని అమిత్ షా ఆరోపించారు. బెంగాల్ ప్రభుత్వం తగినంత భూమి ఇవ్వకపోవడం వల్లే ఇండోబంగ్లా సరిహద్దులో 450 కిలోమీటర్ల మేర ఫెన్సింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కంచె వేసే ప్రక్రియ మొదలైనప్పుడల్లా అధికార టీఎంసీ పార్టీ కార్యకర్తలు గూండాయిజానికి దిగుతున్నారని, మతపరమైన నినాదాలు చేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బెంగాల్ ప్రభుత్వం చొరబాటుదారుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల 450 కిలో మీటర్ల మేర కంచె పనులు పూర్తి కాలేదని అమిత్ షా తెలిపారు. వచ్చే ఏడాది బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఆ ప్రాంతంలో కంచె వేస్తామని చెప్పారు.ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారనర్స్ బిల్లు 2025 ప్రకారం ఇండియాలోకి ప్రవేశించడానికి లేదా బయటకు వెళ్లడానికి నకిలీ పాస్‌పోర్ట్, వీసాను ఉపయోగిస్తున్నట్లు తేలితే ఏడేళ్ల జైలు శిక్ష మరియు రూ.10 లక్షల జరిమానా విధిస్తారు. ప్రతిపాదిత చట్టం ప్రకారం హోటల్స్, విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యా సంస్థలు, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు విదేశీయుల గురించిన సమాచారాన్ని తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది.




## హైబ్రిడ్ మోడల్ రోడ్ల విధానం

దీనిలో మొత్తం 12 వేల కిలోమీటర్ల రోడ్లను మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. మొదటి దశలో 4,600 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీని కోసం ఒక ప్రత్యేకమైన యాప్‌ను ఉపయోగిస్తున్నారు.ఈ యాప్ ద్వారా రోడ్ల సమాచారాన్ని సేకరించి.. అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. వాహనదారులకు భారం లేకుండా, టోల్ ట్యాక్స్ లేకుండా రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరగనున్నాయి. మొత్తం 12 వేల కిలోమీటర్ల మేర రోడ్లను అభివృద్ధి చేస్తారు. మొదటి దశలో 4,600 కిలోమీటర్లు, రెండో దశలో 4,600 కిలోమీటర్లు.. మూడో దశలో 2,800 కిలోమీటర్ల రోడ్లను అభివృద్ధి చేస్తారు. మొదటి దశలో చేపట్టే రోడ్లను గుర్తించడానికి అధికారులు ఒక యాప్‌ను ఉపయోగిస్తున్నారు. దీని ద్వారా రోడ్డు పొడవు, వెడల్పు, కల్వర్టులు, వంతెనలు, వాహనాల రాకపోకల సామర్థ్యం వంటి వివరాలను నమోదు చేస్తారు. ఈ సమాచారం ఆధారంగా ఏ రోడ్లను అభివృద్ధి చేయాలో నిర్ణయిస్తారు.

మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రం వరకు రెండు వరుసల రహదారిని ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా మిస్సింగ్ లింక్ కనెక్టివిటీని అందిస్తారు. ఇక్కడ ఇలా 1,110 కి.మీ. రోడ్లను గుర్తించనున్నారు. జిల్లా కేంద్రం నుంచి రాజధాని వరకు నాలుగు వరుసల రహదారిని ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా కూడా మిస్సింగ్ లింక్ కనెక్టివిటీని అందిస్తారు. ఇలాంటి 820 కి.మీ. రోడ్లను గుర్తించారు. వీటితో పాటు నేషనల్ హైవే, ముఖ్య జిల్లా రహదారుల, ఇతర జిల్లా రహదారులు లకు సంబంధించిన 10 వేల కిలోమీటర్ల రోడ్లను కూడా అభివృద్ధి చేస్తారు.ఈ రోడ్లను అభివృద్ధి చేయడం వల్ల వాహనదారులపై ఎలాంటి భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. 'టోల్ ట్యాక్స్‌లను వసూలు చేసే ప్రసక్తే లేదు' అని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శాసనసభలో ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. మొదటి దశ పనుల కోసం ప్రభుత్వం బడ్జెట్లో రూ.300 కోట్లను కేటాయించింది.

## కేజ్రీవాల్ పై మరో కేసు

కోర్టు విచారణ జరపనుంది.కేజ్రీవాల్‌తో పాటు ఇతరులపై అధికారిక ఫిర్యాదు తర్వాత దర్యాప్తు ప్రారంభించినట్లు రాష్ట్ర పోలీసులు రౌస్ అవెన్యూ కోర్టుకు ఇచ్చిన రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. ఢిల్లీ అంతటా పెద్ద హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడానికి ప్రజా నిధులను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని మార్చి 11న ఢిల్లీ కోర్టు పోలీసులను ఆదేశించింది. కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసిజర్ సెక్షన్ 156(3) కింద దరఖాస్తును అనుమతించాల్సిన అవసరం ఉందని ఈ కోర్టు అభిప్రాయపడింది.దీని ప్రకారం, ఢిల్లీ ప్రివెన్షన్ ఆఫ్ డిఫేస్‌మెంట్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్, 2007లోని సెక్షన్ 3 కింద, కేసు వాస్తవాల నుండి జరిగినట్లు కనిపించే ఏదైనా ఇతర నేరం కింద వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సంబంధిత SHOను ఆదేశించినట్లు అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నేహా మిట్టల్ తన తీర్పులో పేర్కొన్నారు. 2019లో దాఖలైన ఫిర్యాదులో కేజ్రీవాల్, అప్పటి మటియాలా ఎమ్మెల్యే గులాబ్ సింగ్ (ఆప్ పార్టీ), ద్వారక A వార్డ్ మాజీ కౌన్సిలర్ నితికా శర్మలు ఆ ప్రాంతం అంతటా భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజా నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

# చందానగర్ లో కల్యాణ్ జ్యువెలర్స్ నూతన షోరూం ప్రారంభం

■ షోరూంను ప్రారంభించిన ప్రముఖ హీరో నాగార్జున

జయభేరి, మర్చి 28 :




ప్రముఖ ఆభరణాల బ్రాండ్‌లలో దిగ్గజమైన కళ్యాణ్ జ్యువెలర్స్, హైదరాబాద్‌లోని చందానగర్‌లో తమ సరికొత్త షోరూమ్‌ను అట్టహాసంగా ప్రారంభించింది . సూపర్‌స్టార్ నాగార్జున చేతుల మీదుగా ప్రారంభించిన ఈ సరికొత్త షోరూమ్ ద్వారా రాష్ట్రంలో బ్రాండ్ కార్యకలాపాలను మరింత విస్తరించటమే లక్ష్యంగా పెట్టుకుంది.
ఈ షోరూమ్ కళ్యాణ్ జ్యువెలర్స్ కు చెందిన అద్భుతమైన డిజైన్‌ల శ్రేణిని అందిస్తుంది, వీటిలో ముహూరత్ ముద్ర, నిమా మరెన్నో ప్రసిద్ధ బ్రాండ్‌లు ఉన్నాయి. కళ్యాణ్ జ్యువెలర్స్ కు చెందిన జీవనశైలి ఆభరణాల బ్రాండ్ కాండెరే ఆవిష్కరణ ద్వారా ఈ ప్రారంభోత్సవ వేడుకలు మరింత ఆకర్షణీయంగా మారాయి. రూ. 10,000/ ధరలతో ప్రారంభమయ్యే కాండెరేలోని ఆభరణాలు ఆదర్శవంతమైన బహుమతిగా నిలుస్తాయి. ఈ సందర్భంగా సూపర్‌స్టార్ నాగార్జున మాట్లాడుతూ.. కళ్యాణ్ జ్యువెలర్స్ షోరూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందన్నారు. ట్రస్ట్ ఈజ్ ఎవ్రీథింగ్ అనే కంపెనీ సిద్ధాంతానికి అనుగుణంగా వారు చూపుతున్న నిబద్ధత పరిశ్రమలో వారిని ప్రత్యేకంగా నిలబెట్టిందన్నారు. అదేవిధంగా అందరినీ కలుసుకునే అవకాశం లభించినందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు.
అనంతరం నూతన షోరూమ్ పరమాభమైన సందర్భంగా కళ్యాణ్ జ్యువెలర్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ రమేష్ కళ్యాణరామన్ మాట్లాడుతూ ఒక కంపెనీగా, మేము గణనీయమైన మైలురాళ్లను చేరుకున్నామనీ, . గత కొద్ది సంవత్సరాలుగా, తాము ఈ ప్రాంతంలో మా కార్యకలాపాలను వ్యూహాత్మకంగా విస్తరించినట్లు తెలిపారు. చందానగర్‌లోని కొత్త షోరూమ్ మా మార్కెట్ స్థానాన్ని మరింత పటిష్ఠం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే సమయంలో మా విలువైన కస్టమర్లకు మరింత సౌలభ్యం, అవకాశాలను అందిస్తుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు.



## నిర్వాసితుల పై చిత్తశుద్ధి లేని అధికార, ప్రతిపక్ష పార్టీలు

■ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి

జయభేరి, గజ్వేల్, మర్చి 28 :

అసెంబ్లీ సమావేశాలలో నిర్వాసితులకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులు ఉంటాయని ఆశించిన నిర్వాసితుల ఆశలు అడియాసలే అయ్యాయని దీనితో మల్లన్న సాగర్ నిర్వాసితుల పై అధికార, ప్రతిపక్ష పార్టీలకు చిత్తశుద్ధి లేదని అర్థమవుతుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో సిద్దిపేట జిల్లాలోని మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు నిర్వాసితుల పెండింగ్ నష్టపరిహారాలు, ప్యాకేజీలు , కాలనీలలో మౌలిక వసతుల కోసం బడ్జెట్ సమావేశాలలో నిధులు కేటాయించాలని పలు పార్టీలు, ప్రజా సంఘాలు, నిర్వాసితులు చాలా రోజుల నుండి కోరుతున్నారు. అసెంబ్లీ సమావేశాలలో నిర్వాసితుల పక్షాన మాట్లాడడంలో గాని, వారిని ఆదుకోవడానికి నిధులు కేటాయించడంలో గాని అధికార పార్టీతో సహా ప్రతిపక్ష పార్టీలు సైతం విఫలమయ్యాయని అన్నారు బహిరంగ ప్రదేశాలలో నిర్వాసితులను ఆదుకుంటామని పేపర్ ప్రకటనలు చేయడం తప్ప ఆచరణలో ఎలాంటి కార్యాచరణ అమలు కావడం లేదని ప్రతిపక్ష పార్టీలు సైతం ఆదుకోవాలని మీడియా ముందు వచ్చి మాట్లాడడం తప్ప అసెంబ్లీ సమావేశాలలో బిఏసిలో చర్చ జరిగినప్పుడు కానీ అసెంబ్లీ ప్రారంభం సమావేశాలలో మాట్లాడడానికి గాని కృషి చేయకుండా నామమాత్రంగా కట్ మోషన్ ద్వార మాట్లాడుతున్నామని కాలయాపన చేస్తూ రాజకీయ పార్టీల మునగడ కోసం ఎవరికి వారు ప్రయత్నం చేస్తున్నారని వారి వ్యవహార శైలిని నిర్వాసితులైన ప్రజలు గమనిస్తున్నారని ఇప్పటికైనా సహాయం కోసం ఎదురు చూస్తున్న అర్హులైన నిర్వాసితులను అధికారంలో ఉన్న ప్రభుత్వం జోక్యం చేసుకొని నిర్వాసితుల పక్షాన నిధులు విడుదల చేసి వారిని ఆదుకోవాలని లేనిపక్షంలో రాజకీయాలకతీతంగా నిర్వాసితులు పోరాడి సాధించుకుంటామని హెచ్చరించినారు.

## కొండపల్లి డైరీ ఫామ్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

■ 20 కోట్లు వసూలు చేసి పరార్..

జయభేరి, హైదరాబాద్:

కొండ పల్లి డైరీఫామ్ నిర్వహకులు పెట్టు బడుల పేరుతో ప్రజలనుంచి కోట్లాది రూపాయిలు వసూలు చేసి పరారయ్యారని బాధితులు ఎస్. మధు, కేవీ, సాంబశివరావు, కె. వెంకటేశ్వరరావు, డి.సురేందర్ ఆరోపించారు. ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ . భద్రాది కొత్తగూడెంకు చెందిన వేముల సుబ్బారావు అనే వ్యక్తి మొయినాబాద్ వద్ద గల అజీజ్ నగర్ లో కొండపల్లి డైరీ ఫామ్ ఏర్పాటు చేస్తున్నట్టు పేపర్లో ప్రకటన ఇచ్చారన్నారు. ప్రకటన చూసి ఆయనను సంప్రదిస్తే ఒక్కో బర్రె కి 1.30 లక్షలు చెల్లించాలని చెప్పారన్నారు. వచ్చిన లాభాల్లో 36శాతం సభ్యుడికి ఇస్తానని చెప్పడంతో తామంతా ఎక్కువ శాతం ఎమౌంటు కట్టామన్నారు. 20 లక్షల నుంచి కోట్లాది రూపాయిలు ఆభరణాలు తనఖా పెట్టి చెల్లించిన వారు ఉన్నారని చెప్పారు. మొయినా బాద్ వద్ద నున్న ఫామ్లో 5 వందల బర్రెలు ఉండే వన్నారు. రెండు రోజుల క్రితం రాత్రికి , రాత్రే వాటిని అక్కడ నుంచి తరలించుకు పోయారని పేర్కొన్నారు. తమను నమ్మించి మోసం చేసిన సుబ్బారావు, అతని భార్య వేముల కుమారి పై చట్టపరంగా చర్యలు తీసుకుని తమ డబ్బును తిరిగి ఇప్పించాలని కోరారు. దీనిపై మొయినా బాద్ పీఎస్, సైబరాబాద్ కమిషనర్కు ఫిర్యాదు చేశామని, సీఎం రేవంత్ రెడ్డి దీనిపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## గౌడవల్లి గ్రామంలో సమస్యలు పరిష్కరించాలి

■ మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్ కు వినతిపత్రం అందజేసిన కాంగ్రెస్ నాయకులు

జయభేరి, మేడ్చల్ :



గ్రామ పంచాయతీ ఉన్న గౌడవల్లి గ్రామాన్ని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విలీనం చేసినందున గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మాజీ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్ స్వామీ నాయక్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ దీపాలు మరమ్మతులు చేపట్టాలని అలాగే అంతర్గత మురికి కాలువల మరమ్మతులు చేసి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు బ్లీచింగ్ పిచికారీ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పెద్ద చేరువు అలుగు వద్ద సిసిరోడ్డు పనులు చేసి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని, గౌడవల్లి శివాజీ చౌరస్తా నుండి అయోధ్య చౌరస్తా వరకు సింగిల్ హరమ్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు.
వేసవికాలం దృష్టిలో పెట్టుకొని గ్రామంలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ స్వామి నాయక్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు గువ్వ రవి ముదిరాజ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వినోద్ గౌడ్, నాయకులు కొరని భగవాన్ దాస్, మలిగే విష్ణు, సింగిరెడ్డి రఘుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో నిలిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

■ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి

జయభేరి, కోదాడ:



ప్రతి పల్లెను అభివృద్ధి పథంలో నిలిపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆ పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శుక్రవారం అనంతగిరి మండల అమీనాబాద్ గ్రామంలో ఎంజిఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి మంజూరైన రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులుకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడడం లేదని,అడిగిన వెంటనే నిధులను మంజూరు చేస్తుందని అన్నారు.
పద్మావతి రెడ్డి నాయకత్వంలో అనంతగిరి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దెందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కొండపల్లి వాసు,సీనియర్ నాయకులు బుర్ర పుల్లారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు నాయక్,సీనియర్ నాయకులు దేగా కొండయ్య,అమీనాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు, అనంతగిరి పిఎసిఎస్ డైరెక్టర్ బోడేపూడి సత్యనారాయణ,అమీనాబాద్ గ్రామ శాఖ అధ్యక్షులు సాదే కోటేశ్వరరావు,పిఎసిఎస్ మాజీ వైస్ చైర్మన్ చిలకముడు శ్రీనివాసరావు, ,దస్తగిరి,సాదే కోటేశ్వరరావు,దేవపంగు కృష్ణ,బత్తిని రాజయ్య,గ్రామ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## జోడాస్ ఉత్పత్తులన్నీ నాణ్యామైనవే

■ స్వార్థ ప్రయోజనల కోసమే నకిలీ మందులు అని ప్రచారం చేశారు

■ లైసెన్స్ పత్రాన్ని చూపుతున్న కం పెనీ ప్రతినిధులు

జయభేరి, మార్కుక్, మర్చి 28 :



హైదరాబాద్‌లోని జోడాస్ ఎక్స్‌పోయిమ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, కంపెనీ ప్రకారం, దాని ఎగుమతి మార్కెట్లలో ఒకటైన రష్యాలో నకిలీ (నకిలీ) మందులుగా భావించబడిన దాని ఉత్పత్తుల ప్రామాణికత మరియు సామర్థ్యాన్ని నిర్ధారిస్తున్నట్లు ప్రయోగశాల నివేదికలను వెల్లడించారు. అదనంగా, కంపెనీ ప్రతినిధులు సంబంధిత నియంత్రణ సంస్థ, DCA తెలంగాణకు సమర్పించిన CAPA నివేదికను పంచుకున్నారు. ప్రశ్నలోని ఉత్పత్తులు లైసెన్స్ పొందిన మరియు GMPకంప్లైంట్ కాంట్రాక్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (CMO) ద్వారా చట్టబద్ధంగా తయారు చేయబడ్డాయని వారు స్పష్టం చేశారు. JEPL సైట్‌లో నిర్వహించబడే తదుపరి తృతీయ ప్యాకేజింగ్ పూర్తిగా గుర్తించదగినది, నియంత్రిత పరిస్థితులలో రష్యన్ ఫెడరేషన్‌లో ఆమోదించబడిన నియమబద్ధ పత్రాలకు అనుగుణంగా చేయబడుతుంది. ఈ సమస్య రష్యాలో విస్తరించబడిందని ప్రతినిధులు మరింత స్పష్టం చేశారు.
ఇక్కడ కొంతమంది బాహ్య వాటాదారులు బహుశా స్వార్థ ప్రయోజనాలతో ఈ సంఘటనను నకిలీ (నకిలీ) ఔషధ పంపిణీ కేసుగా చిత్రీకరించారు.
ప్రతినిధులు తమ ఉత్పత్తులన్నీ రష్యన్ ఫెడరేషన్‌లో ఆమోదించబడిన నియమబద్ధ పత్రాలు (ND) ప్రకారం, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన మంచి తయారీ పద్ధతులు (GMP) ప్రకారం తయారు చేయబడి పరీక్షించబడ్డాయని స్పష్టంగా పేర్కొన్నారు.సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, నూకరాజు పాల్గొన్ని తెలిపారు.



## రంజాన్ ను పురస్కరించుకొని పండ్ల పంపిణీ

■ 11 మసీదులకు పండ్లను పంపిణీ చేసిన మాజీ కౌన్సిలర్ రామన్న గారి మణికంఠ గౌడ్

జయభేరి, మేడ్చల్:

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పలు గ్రామాలలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రామన్న గారి మణికంఠ గౌడ్ 11 మసీదులకు పండ్లను పంపిణీ చేశారు. మేడ్చల్ తో పాటు రాయిలాపూర్, గిర్మాపూర్, అత్వల్లి, కిష్టాపూర్, పూడూరు ల లోని పది రకాల పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ రామన్న గారి మణికంఠ గౌడ్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం సైతం పండ్లను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఉపవాస దీక్ష ముగియగానే తినేందుకు వీలుగా పలు మసీదులకు పండ్లను పంపిణీ చేసినట్లు మణికంఠ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామన్న గారి మణికంఠ తో పాటు ముస్లిం పెద్దలు పాషా, రఫిక్, ఇనాయిత్, భారీ, ఇషాక్, జమీల్, అష్రాఫ్, అంజాత్ తదితరులు పాల్గొన్నారు.

## ఓల్డ్ ఏజ్ హోం ను సందర్శించిన NSS వాలంటీర్లు

■ వృద్ధులను ఆప్యాయంగా పలకరించిన వాలంటీర్లు

జయభేరి, మర్చి 28 :

అలియాబాద్ లోని ఓల్డ్ ఏజ్ హోం ను ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు మరియు ప్రగతి మహా విద్యాలయ డిగ్రీ కళాశాల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులతో కాసేపు ముచ్చటించి వారి అనుభవాలను పంచుకున్నారు. కాగా వృద్ధులు తమ అనుభవాలను పంచుకుంటూ భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. అయితే ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు వారిని ఆప్యాయతతో దగ్గరికి తీసుకుని వారిని ఓదార్చుతూ ఉల్లాసంగా గడిపారు. తాము మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, తమకు ఏ అవసరం ఉన్న కూడా తమ పిల్లలుగా భావించి తెలపాలని కోరారు. దీంతో వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ డా. శోభారాణి, వాలంటీర్లు, ప్రగతి మహా విద్యాలయం ప్రిన్సిపల్ డా. మాధవీ లత, అమిత్ సింగ్, రాంబాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం చేసిన సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు



జయభేరి, గజ్వేల్, మర్చి 28 :

ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా పనిచేసిన గంధమల్ల యాదగిరి మాదిగ చనిపోవడం బాధాకరమని సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు బుడిగే మహేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాల ఉద్యమ నాయకత్వానికి తనవంతుగా కృషి చేశాడని తెలిపారు. కనీసం ఇల్లు లేని ఆ ఉద్యమకారుడి కుటుంబానికి అండగా ఉండాలంటూ పదివేల రూపాయల ఆర్థిక సాయం చేశారు. అలాగే మన వంతు బాధ్యతగా యాదన్న కుటుంబానికి ఆర్థిక సాయం మీ మీ స్థాయిలో చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులకు వారు తెలిపారు. సమకూరిన డబ్బులను పదవ రోజున పిల్లల పేరు మీద డిపాజిట్ చేస్తామని తెలిపారు.

## నివాళులు అర్పించిన గురిజాల శ్రీరామ్



జయభేరి, పరకాల, మార్చి 28:

భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్ భార్య పుష్ప ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి దశదినకర్మ లో పాల్గొని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి తన వంతు ఆర్థిక సహాయం అందజేసి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించిన బిజెపి హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షులు, దామెర మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరామ్ రెడ్డి. ఈ కార్యక్రమంలో దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ మూల్కా ప్రసాద్, బత్తుల సుమంత్, సింగవేన భరత్ యాదవ్, సింగారపు శ్రీనివాస్, కాగితాల సాయికుమార్ , బత్తుల విశ్వాంత్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళ దారుణ హత్య

జయభేరి, నిజామాబాద్ :

నగర శివారులో మహిళ దారుణ హత్య కు గురయింది. నిందితులు శవాన్ని కారులో తరలిస్తూ పోలీసులు ఆపకుండా వెళ్లిపోయారు. వెంబడించిన పోలీసులు దాస్ నగర్ వద్ద కెనాల్ లో మృతదేహన్ని పడేస్తుండగా పట్టుకున్నారు. మృతురాలు ముబారక్ నగర్ కు చెందిన కమల గా గుర్తించారు. నిందితుడిని పోలీసులు అదుపులో తీసుకున్నారు. కారు స్వాధీనం చేసుకున్నారు.



## అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే రేవూరి

**జయభేరి, పరకాల, మార్చి 28:**

శుక్రవారం పరకాల పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూ ఏస్ అధికారులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో మంజూరైన రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. రాబోయే వేసవి దృశ్య మంచినీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## మత సామరస్యానికి ప్రతీకగా ఇఫ్తార్ విందులు

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**జయభేరి, పరకాల, మార్చి 28:**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పరకాల పట్టణంలోని జామా మసీదు నందు, ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ లోని పద్మావతి గార్డెన్స్ నందు నిర్వహించిన ఇఫ్తార్ విందులో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం సామూహిక నమాజ్ అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు. ప్రజలందరికీ అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరారు. ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజలు, పరకాల నియోజకవర్గ ప్రజలపై అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.

## బ్యూటిషన్ కోర్స్ నేర్చుకోండి

- స్వయం ఉపాధికి బాటలు వేయండి
- సర్టిఫికెట్లు అందజేసిన వీడిఎస్ సొసైటీ




**జయభేరి, దేవరకొండ :**

మహిళలు, బాలికలు నేటి పోటీ ప్రపంచంలో నిలబడాలంటే ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని, దానికి అనుగుణంగా ప్రతిక్షణం పరితపిస్తూ ముందుకు సాగితే ఎలాంటి విజయాలైన కూడా సాధించగలుగుతామని బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు గ్రహీత, వీడిఎస్ కోఆర్డినేటర్ లావుడి బాషా పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని విలేజ్ డెవలప్మెంట్ సొసైటీ వారి ఆధ్వర్యంలో, ఈ ఎస్ ఎస్ వి వై వారి ఆర్థిక సహకారంతో ఉచిత బ్యూటిషన్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ట్రైనర్స్ దుర్గాదేవి, రవి,శాంతి, అలివేలుతో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు.

## నివాళులు అర్పించిన బిఆర్ఎస్ నాయకులు విలేకర్లు



**జయభేరి, హసన్ పర్తి మార్చి 28:**

శుక్రవారం హసన్పర్తి టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బండి రజనీ కుమార్ తల్లి అకాలమరణానికి చింతిస్తూ పూలమాల వేసి నివాళులర్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ జెడ్పిటిసి మార్గం బిక్షపతి, మాజీ ఎంపీపీ అప్పారావు, సీనియర్ నాయకులు కుమారస్వామి సిలువేరు అదేవిధంగా హసన్పర్తి మండల ప్రెస్ సీనియర్ రిపోర్టర్ వేల్పుల ఓదెలు, దుర్గాప్రసాద్, రాజకుమార్, ఎర్ర కుమార స్వామి పంచాయతీ కార్యదర్శి వెంకన్న పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూల్ బస్ లో మంటలు

**జయభేరి, ఖమ్మం:**

ప్రైవేటు స్కూల్ బస్ లో మంటలు చెలరేగాయి. బస్సులో పిల్లలు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. నగరంలోని కిన్నెర బార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో ఘటన జరిగింది. షార్ట్ సర్క్యూట్ తో స్కూల్ బస్సులో చెలరేగిన మంటలను స్థానికులు తక్షణమే స్పందించి మంటలను అదుపు చేసారు.

# సత్యాగ్రహ దీక్ష చేపట్టిన బిజెపి

- రైతుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట సత్యాగ్రహ దీక్ష చేపట్టిన బిజెపి
- ఎన్నికల ముందు కోతలు.. ఎన్నికల తర్వాత ఎగవేతలు
- మోసాల పునాదిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది
- రుణమాఫీ పై ప్రభుత్వం శ్వేత పత్రంవిడుదలచేయాలి.ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో ప్రభుత్వం చెప్పాలి
- రుణమాఫీ 30 పైసలు ఇచ్చి, 70 పైసలు ఎగ్గొట్టారు
- కుంటి సాకులతో కోతలు పెడుతున్నారు.. రైతులను గోసపెడుతున్నారు
- రైతు భరోసావ్యవసాయ కూలీలకిస్తామన్న ఆత్మీయ భరోసా ఏమైంది..?
- రైతు బోనస్ ను బోగస్ ప్రక్రియగా మార్చారు
- దీక్షలో బిజెపి నేతలు కొండపల్లి శ్రీధర్ రెడ్డి , గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు



**జయభేరి, కరీంనగర్ :**

రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని, రైతు రుణమాఫీ, ఫసల్ బీమా యోజన అమలు, రైతు భరోసా, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు అన్నాడి రాజారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రోజున కరీంనగర్లోని కలెక్టరేట్ వద్ద సత్యాగ్రహ దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి దీక్షా కార్యక్రమానికిముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణా రెడ్డి లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. ఎన్నికల ముందు వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు వాగ్దానాలు చేసిందన్నారు. ఎన్నికల ముందు కోతలు కోసిన రేవంత్ రెడ్డి , ఎన్నికల తర్వాత ఎగవేతల ను నమ్ముకొని , కుంటి సాకులతో రైతులకు ఇచ్చిన అన్ని హామీల్లో వాగ్దానాల్లో కోతలు పెడుతూ , రైతాంగాన్ని గోసపెడుతున్నారని మండి పడ్డారు. గత కెసిఆర్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసినట్టే నేడు అంతకంటే దారుణంగా కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకుంటే , నేడు కాంగ్రెస్ ప్రభుత్వం 25 లక్షల మంది కూడా రుణమాఫీ చేయలేదన 70% మందికి ఎగ్గొట్టారని ఆరోపించారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రేమ ఉంటే ఎంతమంది రైతులకు రుణమాఫీ జరిగిందో తెలియజేయాలని, ఈ విషయంపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక రైతు భరోసా విషయంలో కూడా రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు రూ. 15వేలు ఇస్తామని, నేడు అధికారం లోకి వచ్చాక 12 వేలు ఇస్తామని మాట మార్చిందన్నారు. రైతు భరోసా నేటికీ చాలామంది రైతులకు రైతు పెట్టుబడి సాయం అందలేదని , కాలయాపనతో రైతులను తీవ్ర ఇబ్బంది గురిచేస్తుందన్నారు. అలాగే రైతు కూలీలకు 12 వేల ఆర్థిక సహాయం అందిస్తామని నేటికీ ఎంతమంది రైతు కూలీలకు సహాయం అందించారని వారు ఈ సందర్భంగా ప్రశ్నించారు. 14 పంటలకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో లో మేల్కొని, నేడు కేవలం ఒక సన్న వడ్లకే బోనస్ ఇస్తామని, ఆ అంశాన్ని పూర్తిగా బోగస్ ప్రక్రియగా మార్చిందన్నారు. రైతులకు తక్షణం బోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎండలు మండిపోతుండడంతో, పంటలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సరిగ్గా నీటిని విడుదల చేయలేని పరిస్థితులు ఏర్పడడంతో రైతుల పంటలు ఎండిపోయి, నష్టపోయే పరిస్థితులు వచ్చాయన్నారు. అకాల వర్షాలు , వడగండ్ల కారణంగా పంట నష్టపోయిన రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి కనబడటం లేదా...? రైతులను ఆదుకునే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యంగా ఈ విషయంలో కేంద్రం ఇచ్చే సాయం రైతులకు అందకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయడం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన లేదు, పంటల బీమా లేదు, రైతు బీమా అందడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం క్వింటాలు ధాన్యానికి రూ.2320 కనీస మద్దతు ధర నిర్ణయించి రైతులకు అండగా నిలుస్తుంది, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయలేని దుస్థితిలో ఉందన్నారు. క్వింటాలుకు కనీస, మద్దతు ధరతో పాటు హమాలీ చార్జెస్, ట్రాన్స్పోర్ట్ చార్జెలు, ఐకెపి సెంటర్లు, రైతు సంఘాలు , మార్కెట్ యార్డులకు కమిషన్, గోడౌన్ చార్జీలు, ప్రభుత్వ అధికారులకు చార్జీలు, వడ్ల బస్తాలకు, గన్ని బ్యాగులకు, సూతిల్ దారానికి అయ్యే ప్రతి పైసా కేంద్రమే భరిస్తుందన్నారు. పంటను సక్రమంగా కొనుగోలు చేయాల్సిన అయినా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోళ్ల సమయంలో అనేక ఆంక్షలు, కొర్రీలు పెడుతూ రైతాంగాన్ని తీవ్రంగా ఇబ్బంది పెడుతూ, నష్టపెడుతుందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం , నేటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు పెద్ద తేడా ఏమీ లేదని, దొందు దొందేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు వాగ్దానాలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆ సమస్యలు పరిష్కారమయ్యే వరకు రైతుల పక్షాన బిజెపి నిరంతర పోరాటం కొనసాగిస్తుందని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా బిజెపి అధ్యక్షులు రెడ్డబోయిన గోపి, యాదగిరి, కర్ర సంజీవ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభక్క మాజీ మేయర్ సునీల్ రావు, డి శంకర్, రాష్ట్ర నాయకులు బాస సత్యనారాయణ, గుగ్గిలపు రమేష్, ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, కన్నెబోయిన ఓదెలు, బోయినపల్లి ప్రవీణ్ రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు మాడ వెంకట రెడ్డి, బత్తుల లక్ష్మీ నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట రెడ్డి ,ఎర్రబెల్లి సంపత్ రావు, బొంతల కళ్యాణ్ చంద్ర, బింగి కరుణాకర్, అలువేలి సమ్మిరెడ్డి, చొప్పరి జయశ్రీ, మడుగురి సమ్మిరెడ్డి, దుర్శెట్టి సంపత్, కటకం లోకేష్, ఏన్నం ప్రకాష్, బల్బీర్ సింగ్, పుప్పాల రఘు, నాంపల్లి శ్రీనివాస్, ప్రవీణ్, మహేష్, ఉప్పరపల్లి శ్రీనివాస్ తాజా మాజీ కార్పొరేటర్లు , మాజీ ప్రజా ప్రతినిధులు , మోర్చల బాధ్యులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, నాయకులతో పాటు రైతులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది
- ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల అమలులో ప్రాధాన్యత కల్పిస్తున్నాం




**జయభేరి, గజ్వేల్, మర్చి 28 :**


సమాజంలో అట్టడుగుల నిలిచిన మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ లో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మైనార్టీల అభ్యున్నతి అంటే భవన నిర్మాణాలు, షాపింగ్ కాంప్లెక్స్ లు కాదని, ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి తీర్చిదిద్దడంతోనే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం కుల గణన చేపట్టి మైనార్టీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇవ్వగా, రిజర్వేషన్లు, ఉద్యోగాలు, విద్య, సంక్షేమ పథకాల అమలులో అవకాశం కల్పించేందుకు కుల గణన ఎంతో తోడ్పడిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాన్ని తమ హయాంలో జరగనివ్వమని, మైనార్టీ డిక్లరేషన్ లో భాగంగా మైనార్టీ సబ్ ప్లాన్ అమలు చేసే అవకాశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని చెప్పారు. దేశంలో అన్ని మతాలు, కులాలతోపాటు మైనార్టీల రక్షణ కాంగ్రెస్ తోనే సాధ్యపడుతుందని అన్నారు. మైనార్టీల ఆర్థిక ఉద్ధరణ, సాధికారత లక్ష్యంగా ప్రభుత్వ పథకాల అమలులో ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా గజ్వేల్ మైనార్టీలు ఏ సమస్య ఉన్న తనను నేరుగా సంప్రదించవచ్చని వివరించారు.

# ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

**జయభేరి, దేవరకొండ :**



పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని దేవరకొండ పట్టణ పరిధిలోని రాయల్ ఫంక్షన్ హాల్లో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం మైనార్టీ సోదరులకు ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో మైనార్టీ సోదరులు, అధికారులతో కలిసి పాల్గొని,ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పవిత్రమైన రంజాన్ మాసంలో చిన్నపిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు కఠోర నియమాలతో ఉపవాస దీక్షలు చేయడం గొప్ప విషయమన్నారు. రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఇఫ్తార్ విందులతో సోదరభావం పెంపొంది,ప్రజల మధ్య ఐక్యత పెరుగుతుందన్నారు. ఆ అల్లా ఆశీస్సులతో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,RDO రమణా రెడ్డి, మున్సిపల్ కమీషనర్ భాస్కర్ రెడ్డి,తహసీల్దార్ సంతోష్ కిరణ్,CI నరసింహులు,PACS చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ రహత్ అలీ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కామల్ల వెంకటయ్య గౌడ్,పట్టణ మాజీ సర్పంచ్ పున్న వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ బిక్కు నాయక్, ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమొద్దీన్, కార్యదర్శి ఇలియాజ్ పటేల్, మాజీ సింగల్ విండో డైరెక్టర్ యాదయ్య, మాజీ పట్టణ కౌన్సిలర్ భూదేవి సైదులు,మైనార్టీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు,ప్రజా ప్రతినిధులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## కుక్కల తిండిలో స్కామ్

- జగన్ హయాంలో జరిగిన కుంభకోణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..

**జయభేరి, మార్చి 28:**

జగన్ హయాంలో జరిగిన అనేక కుంభకోణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే లిక్కర్ స్కామ్ ప్రకంపనలు ఢిల్లీని తాకాయి. మట్టి తవ్వకాలు, మైనింగ్ ఇలా ఏ ఒక్కదాన్ని వదల్లేదు. తాజాగా జగన్ హయాంలో జరిగిన మరో స్కామ్ వెలుగులోకి వచ్చింది. పోలీసుశాఖలో విధులు నిర్వర్తించేందుకు శిక్షణ పొందే జాగిలాలలకు పెట్టే ఫుడ్ విషయంలోనూ కొందరు అధికారులు కక్కుర్తి పడ్డారు. నిధుల స్వాహాకు తెరలేపారు. నాణ్యత లేని ఆహారాన్ని కొని వాటి ఆరోగ్యం దెబ్బతినడానికి కారకులయ్యారు. అంతే కాదు.. కుక్క పిల్లల కొనుగోలు, ఎంపికలోనూ నిబంధనలను ఉల్లంఘించారు. ఈ నేపథ్యంలోనే బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైంది రాష్ట్రప్రభుత్వం. వారిపై అభియోగాలు మోపింది. ఈ మేరకు హోంశాఖ ఇన్‌ఛార్జి ముఖ్యకార్యదర్శి జి.విజయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎచ్చెర్ల APSP బెటాలియన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న టి.శ్రీనివాసరావు 2012 ఫిబ్రవరి నుంచి 2023 మే 3 వరకూ రాష్ట్ర స్థాయిలో ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, స్పెషల్ సెక్యూరిటీ గ్రూపుల్లోని డాగ్ స్క్వాడ్ విభాగాలకు ఇన్‌ఛార్జ్‌గా విధులు నిర్వర్తించారు. శిక్షణకు అనువైన జాగిలాల ఎంపిక, వాటి కొనుగోలు బాధ్యతలు చూసేవారు. ఆయన 35 కుక్క పిల్లల్ని నిబంధనలు పాటించకుండా కొన్నారు.నాసిరకమైన, నిర్దేశిత ప్రమాణాలు లేని ఆహారాన్ని కొని వాటికి పెట్టేవారు. అందులో 8 రకాల పదార్థాలు నిర్దేశిత ప్రమాణాల కంటే చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో అప్పట్లో శిక్షణ పొందుతున్న కుక్క పిల్లల ఆరోగ్యం దెబ్బతింది. ఆరు కుక్క పిల్లల్ని శిక్షణ నుంచి తప్పించి.. కొత్తవి తీసుకొచ్చి పెట్టారు. ఇలా చేయాలంటే.. హ్యాండ్లర్ల రిక్వెస్ట్ లెటర్, ఇన్‌స్ట్రక్టర్ల అభిప్రాయం, వెటర్నరీ వైద్యుల సర్టిఫికేషన్, ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలి. కానీ అవేవీ పాటించలేదు.దీని వల్ల కొత్తగా తీసుకొచ్చిన కుక్క పిల్లలకు వ్యాక్సినేషన్, ఆహారం వంటి వాటి ఖర్చులకు అదనంగా బడ్జెట్ వెచ్చించాల్సి వచ్చింది. శిక్షణకూ జాప్యం జరిగింది.ఈ వ్యవహారమంతా వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 జనవరి 28 నుంచి 2023 ఏప్రిల్ 24 మధ్య ఇది జరిగింది. ఈ నేపథ్యంలో శ్రీనివాసరావుతో పాటు అప్పట్లో ISW విభాగం ఎస్పీగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కె.సూర్యభాస్కర్‌రెడ్డిపైనా ప్రభుత్వం అభియోగాలు మోపింది. ISWలోని పోలీసు వాహనాలకు కొట్టే ఆయిల్‌నూ పక్కదారి పట్టించి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు.2022 మే నుంచి 2023 ఏప్రిల్ మధ్య 8 వాహనాలకు 4,093 లీటర్ల పెట్రోల్ వినియోగించినట్లు రికార్డుల్లో చూపించి నిధులు డ్రా చేసుకున్నారు. ఆ కాలవ్యవధిలో ఆ వాహనాలు అసలు తిరగనేలేదు. అప్పట్లో ISW మోటారు ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో DSPగా పనిచేసి.. ప్రస్తుతం పీటీవో డీఎస్పీగా ఉన్న డి.కోటేశ్వరరావు, ప్రస్తుతం కృష్ణా జిల్లాలో ఆర్ఎస్సైగా పనిచేస్తున్న ఎం.సతీష్‌కుమార్, కాకినాడ బెటాలియన్‌లో RSI ఎం.కృష్ణను దీనికి బాధ్యులుగా ప్రభుత్వం పేర్కొంది.ఐఎస్‌డబ్ల్యూ విభాగం ఎస్పీగా పనిచేసి పదవీ విరమణ చేసిన కె.సూర్యభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణ లోపం వల్లే ఈ అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఆయన ఇద్దరు SPF కానిస్టేబుళ్ల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ప్రభుత్వం అభియోగాలు మోపింది.


జయభేరి సినిమా
29-03-2025
శనివారం
jayabheridaily.com



## అబద్ధమేవ జయతే

మాస్టర్ వికాస్, విజయ్‌కృష్ణ, మాస్టర్ భాను, అరుణ్, మయనద్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అబద్ధమేవ జయతే'. కె.కార్తికేయన్ సంతోష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పర్పుల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ సంస్థ నిర్మించింది. ఇటీవల జరిగిన సమావేశంలో ఈ చిత్ర టైటిల్‌ను యువ హీరో కార్తికేయ, ఫస్ట్‌లుక్‌ను హీరో సుధీర్‌బాబు విడుదల చేశారు. ఈ సినిమాలో స్త్రీల గర్భాధారణ, ప్రసవ సమయంలో ఎదుర్కొనే సమస్యలను చర్చించామని, 'అబద్ధాలు ఆడితే ఆడపిల్లలు పుడతారు' అనే సామెత ఆధారంగా కాస్త హాస్యం జోడించి ఈ చిత్రాన్ని రూపొందించామని మేకర్స్ తెలిపారు.

## దర్శకుడిగా హృతిక్‌రోషన్



బాలీవుడ్‌లో యాక్షన్, రొమాంటిక్ చిత్రాల కథానాయకుడిగా హృతిక్‌రోషన్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ముఖ్యంగా 'క్రిష్' సిరీస్ చిత్రాలు ఆయనకు తిరుగులేని ఫాలోయింగ్‌ను తెచ్చిపెట్టాయి. ఈ ఫ్రాంఛైజీలో వచ్చిన మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించాయి. దీంతో నాలుగోభాగం కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 'క్రిష్4' అనౌన్స్‌మెంట్ త్వరలో ఉంటుందని బాలీవుడ్ మీడియాలో కూడా వార్తలొచ్చాయి. తాజాగా ఈ సినిమా తాలూకు అప్‌డేట్‌ను అందించారు హృతిక్‌రోషన్ తండ్రి, దర్శకుడు రాకేష్ రోషన్. 'క్రిష్4'కు హృతిక్‌రోషన్ దర్శకత్వం వహిస్తారని ఆయన ప్రకటించారు. '25 ఏళ్ల క్రితం నిన్ను హీరోగా పరిచయం చేశా. ఇప్పుడు దర్శకుడిగా అవకాశమిస్తున్నా. 'క్రిష్' వంటి పాపులర్ సిరీస్‌తో నువ్వు దర్శకుడిగా ఇంట్రడ్యూస్ కావడం ఆనందంగా ఉంది. ఈ కొత్త ప్రయాణంలో నీకు అన్నీ విజయాలు దక్కాలని కోరుకుంటున్నా' అని రాకేష్‌రోషన్ తన సోషల్‌మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు. దాదాపు 700కోట్ల భారీ బడ్జెట్‌తో నాలుగో భాగానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. 'క్రిష్' సిరీస్‌లో మూడు చిత్రాలకు రాకేష్ రోషన్ దర్శకత్వం వహించారు. దీంతో నాలుగు భాగాన్ని కూడా ఆయన డైరెక్ట్ చేస్తారని వార్తలు వినిపించాయి. రాకేష్ రోషన్ తాజా ప్రకటనతో 'క్రిష్4'పై స్పష్టత వచ్చిందని అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## లొకేషన్‌లో ఆయన్ని చూస్తే భయమేసింది..

సన్నీడియోల్ కథానాయకుడిగా టాలీవుడ్ డైరెక్టర్ మలినేని గోపీచంద్ దర్శకత్వం వహించిన బాలీవుడ్ 'జాట్' చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈసినిమాలో నటి రెజీనా కసాండ్రా కీలక పాత్ర పోషిస్తున్నది. ఇటీవల ముంబయ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఇందులోని తన పాత్ర గురించి, 'జాట్' సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది రెజీనా. ''జాట్'లో నా పాత్ర పేరు భారతి. ఇలాంటి పాత్రను పోషించడం నా కెరీర్‌లో ప్రథమం. తెరపై నన్ను చూసి ఆశ్చర్యపోతారు. ఇదొక విభిన్నమైన కథ. ఒక్క రాత్రిలో జరిగే పెను విస్ఫోటనం అని చెప్పొచ్చు. సన్నీడియోల్ నట విశ్వరూపం చూస్తారు. లొకేషన్‌లో ఆయన పెర్ఫార్మెన్స్ చూసి నిజంగా భయమేసింది. ఇక ఆడియన్ ఎలా ఫీలవుతారో అర్థం చేసుకోండి. దేవుడు దిగి వస్తే.. అన్నట్టుగా ఉంటుం ది ఆయన పాత్ర. ఇంతకంటే ఈసినిమా గురించి చెప్పకూడదు. డైరెక్టర్ మలినేని గోపీచంద్‌కి బాలీవుడ్‌లో పెద్ద బ్రేక్ ఈ సినిమా.' అని చెప్పింది రెజీనా.



## ఆ విషయంలో బాధగానే ఉంది

'తాప్సీ పెద్ద కాపీ మాస్టర్.. తన సోదరి కంగనా రనౌత్‌ని ఇమిటేట్ చేస్తూ నటిస్తుంది.' అని కంగనా సోదరి రంగోలి గతంలో మీడియా ముందు వ్యాఖ్యానించి పెద్ద దుమారం రేపింది. ఆ వ్యాఖ్యలపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించింది తప్సీ. 'ఆమెను అదేవిధంగా అనుకోనివ్వండి. నాకేం ఇబ్బంది లేదు. కంగనా ఎంతో టాలెంట్ కలిగిన నటి. ఆమెను కాపీ కొట్టానంటే సంతోషంగా స్వీకరిస్తా. ఒక వ్యక్తి ఎదుగుదలను, వ్యక్తిత్వాన్ని మాటలే నిర్ణయిస్తాయి. నేనైతే నాలా స్వశక్తితో ఎలాంటి నేపథ్యం లేకుండా ఎదిగిన అమ్మాయిని ఈ విధంగా విమర్శించను. కంగనాను కాపీ కొడుతున్నాను అన్నందుకు బాధలేదు కానీ.. కంగనాకు ఇచ్చినంత పారితోషికం నాకు రావడంలేదు. ఆ విషయంలో మాత్రం కాస్త బాధగా ఉంది.' అంటూ అందంగా నవ్వేసింది తాప్సీ.






## చీరపై రామ్ చరణ్ పేరు ప్రింట్ చేయించుకున్న జపాన్ భామ.. మరీ ఇంత ప్రేమనా?

టాలీవుడ్ హీరోలపై జపాన్ అభిమానులు తెగ ప్రేమని కురిపిస్తున్నారు. మొన్నటి వరకు ప్రభాస్, ఎన్టీఆర్‌లపై ప్రేమ కురిపించిన జపనీస్ ఇప్పుడు రామ్ చరణ్‌ని ఆకాశానికి ఎత్తుతున్నారు. గ్లోబల్ స్టార్ రాంచరణ్ 40వ బర్త్ డేను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు ఎంతో అట్టహాసంగా జరుపుకున్నారు. జపాన్‌లో అయితే చరణ్ బర్త్ డేని ఓ రేంజ్‌లో సెలబ్రేట్ చేశారు. ఓ జపాన్ మహిళ అయితే రామ్ చరణ్‌పై ప్రత్యేక అభిమానాన్ని కనబరుస్తూ తన చీరపై తెలుగులో 'రామ్ చరణ్' అని రాయడమే కాకుండా, చెర్రీ ఫొటోను కూడా ముద్రించుకుంది.

అలానే ఒక ప్రత్యేక టేబుల్ ఏర్పాటు చేసి, రాంచరణ్ ఫొటోలను దానిపై ఉంచి బర్త్ డే వేడుక జరిపించారు. తన టీషర్టులపై, సంచులపై, ఇతర వస్త్రాలపై కూడా చెర్రీ ఫొటోలను ముద్రించి చరణ్‌పై తమకున్న ప్రేమని చూపించారు. ఇప్పుడు ఆ ఫొటోలు సోషల్ మీడియా వేదికగా చక్కర్లు కొడుతున్నాయి. ఇక రామ్ చరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమాని జపాన్‌లో కూడా రిలీజ్ చేయాలంటూ అక్కడి ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. ఏది ఏమైన జపాన్ మహిళలు చరణ్‌పై ఇంత ప్రేమని కురిపించడం మెగా ఫ్యాన్స్ ఆనందం కట్టలు తెంచుకునేలా చేస్తుంది.

ఇక రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఆయన తాజా చిత్రం ఆర్‌సీ 16 ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాకు 'పెద్ది' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ వదిలారు. పోస్టర్‌లో రామ్ చరణ్ గుబురు గడ్డం, పొడవాటి జుట్టుతో ఊరమాస్ లుక్‌లో అదరగొట్టారు. చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ కథానాయికగా నటించనుండగా, శివరాజ్ కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు, జగపతిబాబు వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ సంగీతాన్ని అందిస్తుండగా, మైత్రి మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com